క్లుప్తంగా

డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చేశాయని వాటిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను ఇచ్చినా చర్యలు తీసుకోలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న అన్నారు. ఇందుకు నిరసనగా శుక్రవారం కడపలోని డీఈఓ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో కడప అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్ తేజ, రిహాన్, పూర్ణసాగర్, కమల్, సిద్దిక్, రాహుల్, బాలు, సుబ్బరాయుడు, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను సరఫరా చేయాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా ఉర్దూ పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేక పోతున్నారన్నారు. దీంతో ఉర్దూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో విద్యాశాఖ వెంటనే స్పందించి రాష్ట్రంలోని అన్ని ఉర్దూ పాఠశాలలకు వెంటనే పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నజీర్‌బాష, అబ్బాల్‌అలీ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రామభూపాల్

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర నాయకులు రామభూపాల్ విమర్శించారు. శుక్రవారం జెడ్పీ సభా భవనంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూతన విద్యా విధానంలో లోపాలను సవరించాలన్నారు. ఐక్య పోరాటాలు ఉధృతం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఐసీడీఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం దారుణమని ధ్వజమెత్తారు. ఐసీడీఎస్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు సుప్రజ, చందన, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలను అమలు చేయవద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయవద్దని ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బీజేపీ తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

1న యాదె రఫీ కార్యక్రమం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన జుగ్ను ఉర్దూ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జులై 1వ తేది రాత్రి 9.00 గంటలకు కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో సంగీత కార్యక్రమం నిర్వహించనున్నామని నిర్వాహకులు సయ్యద్ మహమూద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆజ్ కీ శామ్ మహమ్మద్ రఫీ, ఎన్టీఆర్, దిలీప్‌కుమార్ కే నామ్ పేరిట నిర్వహిస్తున్నామని, ఇందులో రాయలసీమ వ్యాప్తంగా పేరు గాంచిన యువ గాయనీ గాయకులు పై సినీ కళాకారులకు చెందిన పాటలను ఆలపిస్తారన్నారు.

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని పాత రిమ్స్‌లో శుక్రవారం కడప జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు పంద్రా రంజిత్‌కుమార్, చిరంజీవి అభిమాని అబ్బన్నగారి రాజగోపాల్‌ల ఆధ్వర్యంలో రాజంపేటకు చెందిన ప్రజాప్రతినిధి అతికారి దినేష్ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమం చేపట్టారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని పాత రిమ్స్‌లోని ఆదరణ షెల్టర్ హోంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాలునాయక్, కుమార్ నాయక్, సుధీర్ నాయక్, ఉగ్రణం హేమంత్‌కుమార్, జానీ, నాగార్జున, బ్రహ్మం, హరి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

కడప కార్పొరేషన్: కడప నగరంలో వెలువడే బయోవేస్ట్‌ను ప్రత్యేక వాహనాల ద్వారా తరలించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 31వ డివిజన్ సెవెన్‌రోడ్స్, 35వ డివిజన్ నకాష్, 23వ డివిజన్ నాగరాజుపేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ ఆటోల ద్వారా బయో వ్యర్థాలను స్వీకరించవద్దని సూచించారు. హోటల్స్ నుంచి, నివాస గృహాల నుంచి తడి, పొడి చెత్త వేరు చేసే విధంగా చూసుకోవాలన్నారు. నాగరాజుపేటలో రోడ్లపై చెత్త ఎక్కువగా ఉందని, క్లాప్ ఆటోల ద్వారా ప్రతిరోజూ మూడు ట్రిప్పులు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజుపేట ఉమెన్స్ కాలేజ్ వద్ద ఇబ్బందికరంగా ఉన్న గార్బేజ్ పాయింట్లను తొలగించాలన్నారు. నకాష్‌లో రామాలయం వద్ద నున్న ఐ లాండ్‌లో 8 మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. నకాష్ శ్మశాన వాటికలో ప్రహరీ పూర్తి చేసి, గేటు అమర్చాలన్నారు. గౌస్‌నగర్ కుర్‌కురే ఫ్యాక్టరీపై తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పట్టణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని.. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ఏ షంషీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నకాష్‌లో కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

శ్రీ కాశీ విశ్వేశ్వరునికి పల్లకీ సేవ



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలో గల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, పూలు, సువర్ణ ఆభరణాలతో అలంకారం నిర్వహించారు. నంది వాహనంపై కొలువుదీర్చి బిల్వార్చన, అష్టోత్తర నామావళి, దూప దీప నైవేద్యం, కర్పూర హారతి, ఆలయ ప్రాకారోత్సవాలను మంగళ వాయిద్యాల నడుమ భక్తుల నామ స్మరణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేద ప్రజలకు సేవే లక్ష్యంగా సాగాలి



నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో సంకల్ప్ కోచింగ్ సెంటర్ అధినేత వంశీ, రేణుక

కడప ఎడ్యుకేషన్: నీట్‌లో ర్యాంకులు సాధించిన వారు వైద్యులైన తరువాత పేద ప్రజలకు సేవ చేయాలని సంకల్ప్ కోచింగ్ సెంటర్ అధినేత వంశీ, చైర్‌పర్సన్ రేణుక ఆకాంక్షించారు. శుక్రవారం కడప హౌసింగ్‌బోర్డులోని సంకల్ప్ కోచింగ్ సెంటర్‌లో నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వంశీ, రేణుకాలు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ కడప విద్యార్థులను సైతం జాతీయ స్థాయిలో మెరిపించాలనే లక్ష్యంతో కడపలో 2012లో సంకల్ప్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని.. ఇప్పటి వరకు 287 మందికి ఐఐటీలో 104 మంది మెడికల్ సీట్లను సంపాదించారన్నారు. 2023లో కూడా తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న 7 మంది విద్యార్థులు నీట్‌లో ర్యాంకులను సాధించారన్నారు. ఇందులో ప్రణతిరెడ్డి, వినయసింహారెడ్డి , గణీత్ రాయల్‌శ్రీహర్ష , అబుబకర్‌సిద్దిక్ , చైతన్యయాదవ్ , లిఖితారెడ్డి , రోహిత్‌రెడ్డి ఉన్నారన్నారు. తమవంతు సహకారంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కూడా ఉచితంగా ఐఐటీ, నీట్‌లలో శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు నీట్‌లో ర్యాంకులు సాధించడంలో మీ కృషి ఎంతో ఉందని కొనియాడారు.

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కౌశల్ వికాష్ యోజన ద్వారా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా ఆయా రంగాలలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణంలోని న్యాక్‌లో నిర్వహించనున్న అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ ఎయిర్ కండిషనర్, కుట్టు యంత్రం ఆపరేటర్, టూ వీలర్ సర్వీస్ టెక్నిషియన్, జూనియర్ ఎక్స్‌కావాటర్ ఆపరేటర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని.. ఈ శిక్షణకు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు క్వాలిఫైడ్ సిబ్బందిచేత శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్లను ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణకు 18 ఏళ్ల నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని.. ఈనెల 25వ తేదీలోపు 8వ తరగతి నుంచి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు న్యాక్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

డిపాజిట్లు కట్టిన వెంటనే కనెక్షన్లు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ కోసం డిపాజిట్ కట్టిన వెంటనే సర్వీసు ఇవ్వాలని కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ ఆఫీసర్లు అందరూ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీపీటీ స్కీం ప్రాసెస్ కంప్లీట్ చేయాలని, విద్యుత్ ఫీడర్ల అంతరాయం తగ్గించాలని సూచించారు. అదనపు లోడు చార్జీలు వసూలు చేయాలని తెలిపారు. విద్యుత్ బకాయిలను త్వరగా వసూలు చేయాలని, మీటర్ రీడర్స్ ప్రతి నెల నిర్ణీత సమయంలో రీడింగ్ తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులు రెడ్డి, డీఈఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన

జమ్మలమడుగు : లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని కచ్చితంగా ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి స్కానింగ్ సెంటర్ ప్రభుత్వ నిబంధనలకు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని స్కానింగ్ అర్హత ఉన్నవారు మాత్రమే చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. లింగనిర్ధారణ గురించి చెప్పకూడదన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రాజేశ్వరి, ఎస్సై సుబ్బారెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని నల్లయ్యగారిపల్లె, గొందిపల్లె, గొందిపల్లె దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని తెలిపారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గొందిపల్లె దళితవాడలో విద్యుత్ లైన్లు, సీసీరోడ్లు వేయించాలని ప్రజలు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, సిద్దారెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరామిరెడ్డి, చెన్నారెడ్డి, రామగంగిరెడ్డి, నిఖిల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



గొందిపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వైభవంగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా వేకువ జామున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరూ సమయం పాటించాలి

కమలాపురం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందించాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ చలపతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ వేసి బయటికి వెళ్లిపోతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. కోట్ల రుపాయలు వెచ్చించి సచివాలయాలు నిర్మించింది ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమేనని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం కూడా అదేనని ఆమె అన్నారు. ఇప్పటికైనా సచివాలయ ఉద్యోగులు తమ పద్ధతి మార్చుకోకపోతే ఇంటికి వెళ్లక తప్పదన్నారు. జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి రోడ్లులేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని, పీఆర్ అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి రోడ్లులేని గ్రామాలను గుర్తించాలన్నారు. ఒక గ్రామం నుంచి ఇతర గ్రామాలకు కనెక్టివిటి రోడ్లు నిర్మించాలన్నారు. వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతి కందే ఎత్తులో ఉన్నాయని, వాటిని సరిచేయాలని ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషాను కోరారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సర్పంచులకు నిధులు విడుదల చేయాలని కోరారు. తమ ఏకగ్రీవ పంచాయతీకి మంజూరైన నిధుల్లో తనకు తెలియకుండానే కరెంట్ బిల్లులకు చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఎంఈఓ జాఫర్ సాదిక్, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సునీత, మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ బేగం, ఏపీఓ అన్నానాయక్, ఏఓ సరస్వతి, ఏపీఎం అపర్ణ తదితరులు తమ శాఖ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, ఎంపీటీసీలు ప్రియాంకరెడ్డి, తులసీ, జగన్‌మోహన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాగరాజ ఆచారి, జయసుబ్బారెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టకూడదు

చెన్నూరు : బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం నేరమవుతుందని చైల్డ్ లేబర్ ఆఫీసర్ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణాల యజమానులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా శుక్రవారం చెన్నూరులో పాత రోడ్డు నుంచి కొత్త రోడ్డు వరకు అన్ని కూల్ డ్రింక్ షాపులు, చికెన్ షాపులు, కిరాణా షాపులు, హోటళ్లు, బేకరీ షాపులు వద్దకు వెళ్లి లేబర్ యాక్టు గురించి వివరించారు. 18 సంవత్సరాల పిల్లలను పనిలో పెట్టుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ఓబులవారిపల్లె : శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాటించడంతో అధిక దిగుబడులు పొందవచ్చని వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ ఉద్యాన కళాశాల దత్తత గ్రామమైన వైకోట గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ వైకోటలో ప్రత్యామ్నాయ పంటలు, ఔషధ మొక్కలు గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. అలాగే అనేక రకాల మొక్కల సాగుపై వివరించినట్టు తెలిపారు. అత్యాధునిక సస్యరక్షణ మందులు, సాంకేతిక సలహాలను రైతులకు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన రైతులను ఆకట్టుకుంది. ఇందులో మామిడి రకాలు, ఉద్యాన పంచాంగం, పండు ఈగ, ఎర్రలు, ట్రికో ధర్మ విరిడీపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సూచించారు. ఇందుకు గ్రామంలోని ప్రతి ఇంటికి ఒక పండు మొక్కను అందజేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.మమత, అధ్యాపకులు డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సీహెచ్ రూత్, డాక్టర్ నిశ్చల, డాక్టర్ వీరేష్, డాక్టర్ వినోద్, తులసీరామిరెడ్డి పాల్గొన్నారు.



పండ్ల మొక్కలను అందజేస్తున్న ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు, సర్పంచ్ ఈశ్వరయ్య

ప్రారంభమైన వార్షికోత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన కొత్తగంగమ్మ వార్షికోత్సవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం ఆలయ ఆవరణలో ఓల్డ్ క్యాటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఖాతాదారుల సేవలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ముందుందని ఏపీజీబీ చైర్మన్ రాకేశ్ కశ్యప్ పేర్కొన్నారు. స్థానిక ఏపీజీబీ ప్రధాన శాఖ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం సరళ రుణకేంద్రాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందిస్తున్నామన్నారు. రుణాలను సులభతరంగా అందించేందుకు సరళ రుణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. దీని వల్ల రుణ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు. ఖాతాదారులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలైన పీఎంజేజేవై, పీఎంఎస్‌బీ, ఏపీవై తదితర పథకాలలో చేరి వారి కుటుంబ భవిష్యత్‌కు మంచి బాట వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు శ్రీదేవి, చీఫ్ మేనేజరు రమేష్ కుమార్, సీనియర్ మేనేజరు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



రుణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాకేశ్ కశ్యప్

భూసార పరీక్షలు చేయించుకోండి

కమలాపురం : పంటలు సాగు చేసే ప్రతి రైతు తప్పని సరిగా తమ పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని కమలాపురం–3 ఆర్‌బీకే వీఏఏ లాలిత్యారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌బీకే పరిధిలోని రైతుల నుంచి ఆమె మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాల్లో మటి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేస్తే ఫలితాలను బట్టి ఎరువులను వాడవచ్చన్నారు. దీంతో వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని, అలాగే దిగుబడులు పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఆమె తెలిపారు. పంటల సాగులో అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని ఆమె సూచించారు.

21న వాహనాల వేలంపాట

బద్వేలు అర్బన్ : పట్టుబడిన టాటాఏస్ వాహనానికి ఈనెల 21న మార్కెట్‌యార్డు ఆవరణలోని ఎస్‌ఈబీ స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మురళీమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఎస్‌ఈబీ స్టేషన్‌లో నిర్దేశించిన రుసుములో 50 శాతం డిపాజిట్‌గా చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9440902606 నెంబరును సంప్రదించాలని కోరారు.

డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ఇంధన పొదుపు పాటిస్తూ సంస్థ పురోగతికి తోడ్పాటు అందించాలని సంస్థ కడప జోన్‌ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప రీజియన్‌లో ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్‌పై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో మెలకువలు పాటించడం ద్వారా ఇంధనాన్ని పొదుపు చేయవచ్చన్నారు. గతంలో ఇంధన పొదుపు పాటించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చిన వారిని స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా ప్రతి డ్రైవరు సమయపాలన పాటించాలని, మద్యానికి దూరంగా ఉండాలని, ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం డ్రైవింగ్‌లో నిపుణులైన వారు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ లక్ష్మీభాస్కర్, బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడపజోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

సరెండర్ లీవ్ మంజూరులో నిర్లక్ష్యం

– డాక్టర్ వెంకటరాముడు ఆవేదన

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాలలో మానసిక విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్. వెంకటరాముడు తన సరెండర్ లీవ్‌కు సంబంధించిన డబ్బుల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహించారని ఆవేదన చెందారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు రావాల్సిన సరెండర్ లీవ్‌ల నుంచి డబ్బులను మంజూరు చేయించుకునేందుకు తమ వైద్యకళాశాలలో ఈనెల 8న ఎస్టాబ్లిష్‌మెంట్, అకౌంట్స్ విభాగాలలో దరఖాస్తు చేసుకున్నామన్నారు. అయితే సీనియర్ అసిస్టెంట్‌ల నిర్లక్ష్యం వలన తన బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు పడలేదన్నారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. × ఈ సంఘటనపై ఎస్టాబ్లిష్‌మెంట్, అకౌంట్స్ విభాగాల ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను ×సాక్షి₹ వివరణ కోరగా డాక్టర్ వెంకటరాముడు 10 రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సిందిపోయి, ఈనెల 9న దరఖాస్తు చేసుకున్నారని, 10, 11 తేదీలు రెండవ శనివారం, ఆదివారం సెలవురోజులన్నారు. ఈనెల 13న ప్రొసీడింగ్స్‌ను ఆయనతోపాటు, దరఖాస్తు చేసుకున్న మిగతా ముగ్గురు డాక్టర్లకు కూడా ఇచ్చామన్నారు. ఈనెల 15వ తేదీన మధ్యాహ్నంలోపే ట్రెజరీలో ఈ బిల్లులకు సంబంధించి సర్వీస్‌లను నిలిపివేశారని వివరణ ఇచ్చారు.

ఆర్టీసీని లాభాలబాటలో నడిపించేందుకు కృషి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగర శివార్లలోని జోనల్ వర్క్‌షాప్, జోనల్ స్టోర్స్, టైర్ రీట్రేడింగ్ షాపులో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని సూచించారు. అలాగే ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా చేయూతనందించాలని కోరారు. అందరి సమన్వయంతో ఆర్టీసీ ఉన్నత స్థానంలో నిలువగలదని వివరించారు. రాష్ట్రంలో కడపజోన్‌ను నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని, అందుకు ప్రతి ఉద్యోగి సహకారాన్ని అందించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు పరమేశ్వర, బ్రహ్మయ్య, ప్రమీళాదేవి, బాబు, ఎర్రిస్వామి, యల్లాస్వామి, సుధాకర్, ఎస్ఎస్ సింగ్ తదితరులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ అజంతుల్లా, సీఓఎస్ హరినాథ్‌బాబు, అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్ రవీంద్రబాబు, మునీంద్రుడు, రఫీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.